# సిరిమల్లెపూవు

**ద్వైభాష్యం సూరీడు**

"శ్రీనగర్ కాలనీలోవున్న ఆ భవంతి పేరు 'శ్రీనిలయం!'

అది, ఆ యింటి మేడమీదవున్న పడక గది. ఆ గదిలో — కిటికీ ప్రక్కన కూర్చున్న రాఘవరావుగారు అప్పటికి మూడు రోజులుగా ప్రయత్నించి తాను రాస్తున్న ఆ ఉత్తరం చదువుకుంటున్నారు.

"బాబూ, మోహన్!

నీ వైవాహిక జీవితానికి ఇవే నా శుభాకాంక్షలు.

— ఇంతకు ముందు లాంఛనంగా నువ్వూ, మీ తల్లిదండ్రులూ, మీ బంధువులూ — పెళ్లిచూపులకు వచ్చి, పిల్ల నచ్చిందని చెప్పి, ఈ వివాహానికి ఒప్పుకున్నా, 'సౌందర్య'గూర్చి కాస్త వివరంగా నీకు తెలిజేయడం ఇంతవరకూ కుదరలేదు. కొన్ని క్షణాలు ఆమెతో గడిపితే చాలు — ఆమెను నువ్వు పూర్తిగా అర్థం చేసుకోగలవు. ఆశక్తి నీలో వున్నదని నాకు నమ్మకముంది. అయినా, ఆమె గూర్చి ఈ పరిచయ వాక్యాలు నేను చెప్పాలని నా అభిలాష. ఆమె విద్యార్హతలూ, అందచందాలూ — ఆనాడు నువ్వు తెలుసుకున్నా— ఆమెకు ఈ విద్య నేర్పించడంలో నాకుగల ఉద్దేశ్యాలూ — ఆమె మనోభావాల తీరుతెన్నులు, ఆమె అలవాట్లు ఇష్టాయిష్టాలు, వీటన్నింటి గురించీ వివరించాలనే ఈ ప్రయత్నం! మీ ఇద్దరి మధ్యా స్నేహాన్ని మరింత త్వరగా సంపాదింప జేయడానికి ఈ పరిచయం తోడ్పడుతుందని నా ఆశాభావం..

ఇన్నాళ్ళూ 'సౌందర్య' నాకు సర్వస్వం. ఇరవై రెండేళ్లు ఈమెను ఎంతో సుకుమారంగా పెంచి, ఇకపై తన జీవితాన్నంతా అతి మనోహరంగా నీతో పంచుకోమని ఈ నాడు ఈమెను నీ చేతుల్లో పెడుతున్నాను.

సౌందర్య నా గారాబు బిడ్డ. నా 'లలిత' నా ముప్పై ఆరవ ఏట, తాను ఈ ప్రపంచానికి వీడ్కోలు చెప్తూ, తన ప్రణయ చిహ్నంగా నాకు మిగిల్చిపోయిన ప్రేమకానుక. ఆమె ప్రసాదించిన ఈ వరం నాకెంతో అపురూపం. ఈమె జీవితం ఆనందమయం చేయడం లలితకు నేనిచ్చిన ఆఖరి వాగ్దానం! అది నెర వేర్చడం కోసమే — ఈమెను నా చేతులారా పెంచి పెద్దదాన్ని చేయడం కోసమే — ఎందరో ఏమో అన్నా, ఇన్నేళ్లూ ఇలా ఒంటరిగానే మిగిలిపోయాను. సౌందర్య పెంపకంలోని ప్రతి ఘట్టంలోనూ, లలిత కృతజ్ఞతా పూర్వకంగా నాకు కలలలో దర్శనమిచ్చేది. అందుకే సౌందర్యను ఒక ఆదర్శవంతమైన వనితగా చేయాలని ఎంతో కృషి చేశాను.

నీ మనోభావాలను బట్టే, నీ జీవన విధానాన్ని బట్టే నీవు ఆమెను ఏదైనా ఉద్యోగంలో చేర్పించాలని నీకనిపిస్తే అందుక్కావలసిన విద్యార్హతలు కొంతవరకూ ఈమెకు వున్నాయి. కాని వనితలు ఉద్యోగాలు చేయడం నేను హర్షించను. తను అందువల్ల అలసి పోతుందేమోనని కాదు. తను ఉద్యోగం చేస్తూ నీకు అర్ధాంగిగా తన కర్తవ్యం మాటికి నూరుపాళ్లూ నిర్వహించ లేదేమోననే నా భయం!

ఇది కంప్యూటర్ల యుగం. ఇంజనీర్లకైనా, డాక్టర్లకైనా, పెద్ద పెద్ద సంస్థల అధినేతలకైనా లేదా పరిశ్రమల యజమానులకైనా — కంప్యూటర్స్‌తో పని రోజు రోజుకూ పెరుగుతోంది. తన భర్త ఏ స్పెషాలిటీకి చెందిన వ్యక్తి అయినా — అతని దైనందిన కార్యకలాపాలలో అతని కష్ట సుఖాలు పంచుకోగలిగేందుకూ — అతని సమస్యలను అర్థం చేసుకుని సామరస్యం చూపగలిగేందుకూ తగిన 'అర్హత' సంపాదించాలనే ఎమ్.ఎస్.సి. గణితశాస్త్రం — కంప్యూటర్ సైన్సు ప్రత్యేకతతో చదివి, బంగారు పతకాన్ని అందుకుంది. ఆమె అభ్యసించిన ఈ విద్య, నీకు తాను చేదోడు వాదోడుగా ఉండడానికి ఉపయోగపడాలని కోరుకుంటున్నాను.

ఆరోగ్యమనేది కేవలం అదృష్టమే అయినా, చాలా వరకు అది మన ఆహార విహారాలలోనూ మనం అవలంబించే నియమాలలోనూ ఉంటుందని సౌందర్యకు బాగా తెలుసు. సౌందర్య — 'సార్థక నామధేయురాలు' అని అందరూ అంటూంటారు? తన ఆరోగ్యం కాపాడుకోడానికి ఎన్ని నియమాలైనా పాటిస్తుంది. తమ రోగాలకు ఆలయమై నీ సంపాదనకు తానొక ఖర్చు సాధనం కాకూడదని ఆమె అభిలాష?

మానసిక వికాసానికి కళలెంతో తోడ్పడుతాయి. ముఖ్యంగా — సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం — ఈ మూడింటినీ సాధించగలిగిన వ్యక్తి భగవత్స్వరూపుడంటారు. అంత పదవికి ఈమె ఆకాంక్షించ లేదుగాని, వాయులీనంపై చక్కని కర్నాట సంగీతం నేర్చుకుంది. అలాగే మంచి సాహిత్యమంటే ఎంతో ఇష్టపడుతుంది. అటు ఆంగ్లభాషలోనూ ఇటు మాతృభాషలోనూ కథలూ, కవితలూ రాయడమే కాకుండా ఉత్తమ సాహిత్యంలోని మెలకువలను ఇట్టే పసిగట్టేస్తుంది.

శ్రీమతి అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచన కథానాయికలా అన్ని మంచిలక్షణాలూ ఈమెకే వున్నాయని ప్రగల్భాలు చెప్పకోడానికి నేనీ మాటలనడంలేదు. నేచెప్పేవన్నీ సౌందర్యపట్ల నిజాలు. ఇవన్నీ ఆమె కృషి రంగాలు.

కాని, నాకు తెలుసు బాబూ! ఒక ఆడపిల్ల జీవితం ఏ మార్గంలో వెళ్లాలో నిర్ణయించేది తన తండ్రి కాదు — భర్త అని! ఆ విషయం దృష్టిలో వుంచుకొనే — విద్యా, ఆరోగ్యం, కళలు, ఈ మూడింటితో పాటు — ఆమె మనసుకూడా పొందికగా తీర్చి దిద్దడానికి కృషి చేశాను. తను ఇంతవరకూ సాధించిన విజయాల వల్ల ఆమెకు ఇసుమంత కూడా గర్వం లేదు. మీ ఇరువురి మనుగడలో ప్రాధాన్యత నీకే యిచ్చి, తాను కేవలం "సహాయకారిణి"గా సంతృప్తి చెందాలన్న సంకల్పంతోనే నీ ఇంట అడుగిడుతోంది. ఆమె సంపాదించుకున్న విద్యను, సాహిత్యాన్ని, సంగీతాన్ని ఎలా వినియోగించుకుంటావో భారం నీదే!"

అంతవరకూ రాసిన ఆ ఉత్తరం అక్కడ మేజామీద పెట్టి, కిటికీలోంచి బయటకు చూశారు రాఘవరావుగారు. పచ్చని లాన్స్‌మధ్య గుబురుగా పెరిగిన బొగడ చెట్టునీడన కనిపించింది సౌందర్య. ఎర్రని జరీ బోర్డర్ ఉన్న తెల్లని నైలాన్ చీర — అదే కాంబినేషన్‌గల జాకెట్టూ వేసుకుంది! ఎర్రరంగు లోలకులు అక్కడకు దగ్గరగా వున్న అదే రంగు మెట్ట తామర పూలతో పోటీ పడుతున్నాయి. ఒందికగా క్రింద కూర్చుని, బొగడ పువ్వులేరు కుంటోంది సౌందర్య.

అంతవరకూ రాసిన ఆ ఉత్తరం అక్కడ మేజామీద పెట్టి, కిటికీలోంచి బయటకు చూశారు రాఘవరావుగారు. పచ్చని లాన్స్‌మధ్య — గుబురుగా పెరిగిన బొగడ చెట్టు నీడన కనిపించింది సౌందర్య !!

"పిచ్చి తల్లీ — నువ్వు లేక ఇంకతోట చిన్నబోతుందిరా!" అనుకుంటూ కళ్లు చెమర్చారు రాఘవరావుగారు. పిచ్చిగా అటూ ఇటూ కొంత సేపు గదిలోనే పచార్లు చేసి, ఇంకా రాయవలసిన ఉత్తరం రాయడం మొదలెట్టారు.

"అయితే, సౌందర్యకు ఇష్టం లేనిదీ నిజంగానే తాను తట్టుకోలేనిది ఒకటున్నది బాబూ?"

ఇంతవరకూ — తాను శాకాహారిగానే పెరిగింది. ఇకపైన కూడా తాను అలాగే మిగిలిపోవాలని తన ఆకాంక్ష. ఈ విషయంలో వ్యక్తిగతంగా నీ కెటువంటి అభిప్రాయాలున్నా, ఆమెను మాత్రం — ఇలాగే — ఈ ఒక్క విషయంలోనూ ఉంచమని నా కోరిక.

తన హక్కుల కోసం తాను పోరాడాలని కాని, ఏ విషయంలోనైనా సరే నీపై తన ఆధిక్యతను ప్రదర్శించుకోవాలని కాని, అనుకునే మనిషి కాదు సౌందర్య.

సంసారమనే సంస్థకు నాయకుడు భర్తయేననీ — ఆ సంస్థల్లో భార్య చాలా వరకూ సహాయ పాత్ర మాత్రమే వహించాలనీ నా దృఢ విశ్వాసం. స్త్రీ స్వాతంత్ర్యం పేరుతో జరిగే రకరకాల కార్యక్రమాలు మన కళ్ల ఎదట కనిపిస్తున్నా నిశితంగా పరిశీలించి చూస్తే — మన సంఘంలో ప్రస్తుత పరిస్థితుల్లో భార్య సపోర్టివ్ రోల్ మాత్రం వహించిన సంసారాలు ఒక పద్ధతిగానూ — దానికివ్యతిరేకంగా వున్న సంసారాలు మరో పద్ధతిగానూ వుండడం మనం చూస్తూనే వున్నాం.

ఆడది మగాడితో సమానంగా అన్ని రంగాలలోనూ ముందంజ వేయ కూడదని నా అభిప్రాయం కాదు. భౌతికంగానూ — ప్రకృతి సిద్ధంగానూ — ఈ సృష్టిలో ఆడప్రాణికి వున్న బాధ్యతలూ, బలహీనతలూ తలచుకొని మౌనంగా నాలో నేనే రోదిస్తాను. ఈ సృష్టి ఇలా వున్నంత కాలం ఈ బలహీనతలను తన పరం చేసుకోడం స్త్రీకి తప్పదు. —ఆ నిజాన్ని తెలుసుకున్న మన సంస్కృతి — అందుకే ఇదమిత్థంగా కొన్ని కార్యక్రమాలు వాళ్లకి మాత్రం కేటాయించి, మానసికంగా కూడా స్త్రీకి ఒక మూసపోశారు. చిన్ననాటి నుండే ఆ మూసకు అలవాటు పడి పెరిగిన ఆడపిల్లలు — ఆనందంగా తమ జీవితమంతా గడప గల్గుతున్నారు. వారేదో పోగొట్టుకుంటున్నారన్న భావన వారికి కలగడం లేదు. అందుకే వారికి మనో వ్యాకులతలు లేవు.

అటు ఈ నిజాన్ని జీర్ణించుకోలేక, ఇటు ప్రకృతికివ్యతిరేకంగా వెళ్లలేక — కొందరు వనితలు — స్త్రీ స్వాతంత్ర్యం అన్న పేరుతో — అనవసరమైన అగచాట్లకూ — కష్ట నష్టాలకూ గురిఅవుతున్నారు.

ఈ మధ్య వార్తాపత్రికల్లో ఒక విచిత్రమైన విషయం చదివే వుంటావు. స్త్రీ స్వాతంత్ర్యం అతిగా ప్రబలిన అమెరికా దేశంలో చాలామంది మగవారు వాపోతున్నారట— తమ స్త్రీలలో "స్త్రీత్వం" అనేది నానాటికీ నశించిపోతోందని! వారికి స్త్రీలాలన కరువైపోతోందని, తూర్పు దేశాలనుండి ముఖ్యంగా జపాన్, ఇండోనేషియా వంటి దేశాల నుండి వారు భార్యలను తెచ్చుకుంటున్నారట?! ఇలాటి పరిణామాలు మనదేశంలో — మన జాతిలో రాకూడదనీ— భారత నారికి ప్రపంచమంతటిలోనూ ఒక ప్రత్యేక స్థానముండాలనీ కలలు కనే వ్యక్తుల్లో నేనొకణ్ణి! అందుకే బాబూ, సౌందర్యను ఈ మూసలో పెంచాను. నీతో సమంగా ఉద్యోగం చేస్తానని తను పేచీ పెట్టదు. నీ భవిష్యత్తు కోసం — నీ కార్య కలాపాలలో నిర్విరామంగా నీవు శ్రమ పడుతూ వుంటే — తనను అలక్ష్యం చేశావని విసుగు చెందదు. ఆ విసుగుకు బానిసయై — తాను క్లబ్బులనీ — పార్టీలనీ కాలక్షేపానికి బయట తిరుగదు!

నీ జీవితానికి ఓ అర్థం కలిగించాలనీ నీ వంశ వృక్షాన్ని కాపాడాలనీ, నీ కష్ట సుఖాలు పంచుకొని ఒక ఆదర్శవంతమైన గృహిణి కావాలనీ — ఒక అందమైన ఆంధ్ర వనితగా నీ దగ్గరకు వస్తోంది.

ఇలా — ఇంత సున్నితంగా పెరిగిన సౌందర్యకు ఒక మంచి మొగుడు రావాలనీ — తనకున్న సంస్కృతికి మరింత మెరుగులు దిద్దే నాథుడు ఆమె జీవితంలో ప్రవేశించాలనీ — ఆమె చుట్టూ చిక్కగా పేరుకున్న నా మమతానురాగాలను సైతం మైమరపించే మహాపురుషుడు ఆమె భర్త అవ్వాలనీ — నేను కలలు గన్నాను బాబూ!

నీ గురించి వీలయినన్ని విషయాలు తెలుసుకున్నాకనే ఈ సంబంధం నిర్ణయించాను. అయినా — ఆమె బ్రతుకును నెత్తావి మాధురులతో నింపే భారం పూర్తిగా నీదేనని మరోసారి మనవి చేస్తూ ఆ భారం తీయగా వహించమని ప్రాధేయపడుతూ — ఈ సౌందర్యను — ఈ "సిరిమల్లెపూవు"ను నీ చేతిలో పెడుతున్నాను."

పూర్తి చేసిన ఉత్తరాన్ని మరోసారి — తృప్తిగా చదువుకున్నారు రాఘవరావుగారు.

సౌందర్య వివాహం మరో వారం రోజుల్లో జరగవలసి వున్నది. అవతల పెళ్ళి పనులన్నింటి విషయంలోనూ ఆయన పడుతున్న శ్రమంతా ఒక ఎత్తు? ఈ ఉత్తరం రాయడంలో వహించిన శ్రద్ధ మరో ఎత్తు.

ఉత్తరం రాయడమైతే పూర్తయింది. అది అతనికి వివాహ సమయానికి ముందుగా ఎలా అందించాలన్నదే ఆలోచన?

— సౌందర్యచే అతనికొక అందమైన ఉత్తరం రాయించి ఆ ఉత్తరంతో పాటు పంపితే!?

.. ఛ ఛ! బాగుండక పోవచ్చు!!

— పెళ్ళిరోజున అతన్ని అలా జూబ్లీహిల్స్ వైపు కారులో తీసుకువెళ్లి, ఆహ్లాదకరమైన వాతావరణంలో అతనిచే అది చదివిస్తే!?

... బాగానే వుండవచ్చు కాని — అంత హడావుడిలో అంత తీరిక చిక్కుతుందో చిక్కదో?!

— పోనీ వివాహ వేదిక మీద మాంగల్య ధారణఅవ్వగానే అందరి సమక్షంలోనూ ఆ వుత్తరాన్ని మైకులో చదివితే?!

... ఊహూ! ఇది అసలే బాగులేదు సౌందర్యకు తాను పెద్ద పబ్లిసిటీ ఇచ్చినట్టవుతుంది.

— పోనీ ఇదంతా ఒక మ్యూజిక్ కాసెట్‌లో చదివేసి — మిగతా క్యాసెట్టు నిండా సౌందర్య వాయులీన విభావరి వినిపిస్తే!?

... అవును — ఈ భావన బాగుంది. శోభనం గదిలో ఇది నేపథ్య సంగీతంగా ఉండేలా ఏర్పాటు చేస్తే సరి!

కాని సౌందర్య ఒప్పకోపోవచ్చు. తన ఎదురుగా అతను ఇదంతా వినడం ఆమెకు చాలా ఇబ్బందిగా వుండొచ్చు.

— పైగా అతని మనోభావం తెలుసుకోకుండా ఈ రిస్కు తీసుకోకూడదు. ఇంతమంచి అనుభవానికి ముందర ఇదెక్కడి సుత్తిరా నాయనా అని అతను నెత్తి బాదుకుంటే — ఛఛ! అంతకంటె రసాభాసం మరొకటి వుండదు.-

—ఏమో — ఏ పద్ధతి ద్వారా అతనికి ఈ సందేశం వినిపించాలో ఆనాటి సందర్భాన్ని బట్టే చూడవచ్చు, కాని ఎలాగైనా సరే — అతనికి ఆరోజు ఇది అందేలా చూడాలి??

* * *

శ్రీ నిలయం శోభాయమానంగా వెలుగుతోంది.

ఆ సమయం — ఆ యింటి చరిత్రలో అతి ముఖ్యమయిన సమయం.

—మరో రెండు గంటల్లో అచ్చట జరుగబొయ్యే కల్యాణ ఘట్టానికి వచ్చిన బంధుమిత్రుల కోలాహలంతో నిండిన సమయం!

—కళాత్మకంగా తీర్చిదిద్దిన పెళ్లి పందిరికీ — అందున్న వివాహవేదికకూ — అవి నిర్మించిన వారు తుది మెరుగులు దిద్దుతున్న సమయం.

—ఆహ్వానితుల వాహనాలు పార్కింగ్ కోసం ప్రాకులాడుతూ ఫీంకరిస్తున్న సమయం.

—వివాహానికి హాజరయిన వనితలు అభవనం ముందున్న లాన్స్‌లో — చిన్న చిన్న సర్కిల్స్‌లో

మాట్లాడుకుంటున్నప్పుడు — ఖరీదయిన వారి పట్టు చీరలు దీపాల కాంతిలో ధగధగా మెరుస్తున్న సమయం!

—రకరకాల అత్తరుల గుబాళింపులు గాలిలో తియ్యగా దోబూచులాడుకుంటున్న సమయం!

—ఆ యింటి యజమాని రాఘవరావుగారి హృదయంలో ఆనందమూ — ఆవేదనే ఒకేసారి మిళితమై ఆయన మనసును మథన పెడుతున్న సమయం! ఒక వైపు మిగతా బాధ్యతలన్నీ నిర్వహిస్తూనే — మరో వైపు తన సందేశాన్ని పెళ్ళికుమారునికి ఎలా అందించాలా అన్న విషయంపై ఆయన ఇంకా ఆలోచిస్తూనే వున్న సమయం.

కొంతసేపటికి అందరి దృష్టి అటువైపు మళ్ళింది. అందరూ అటువైపు నడుస్తున్నారు!

—ఆకాశమంత పెళ్లి పందిరి.

—రంగు రంగుల విద్యుద్దీపాల తళతళ!

—శుభ సందర్భాన్ని గుర్తు చేసే శ్రావ్యమైన సన్నాయి పాట!

—స్వచ్ఛమైన పూలతో పల్లకీ ఆకారంగా అలంకరించిన వివాహవేదిక?

—ఆ వేదిక నిర్మాణాన్నీ ఆ ప్రయత్నానికి నిర్మాణత వహించిన వ్యక్తినీ ప్రశంసిస్తూ పందిట్లో నగిషీ కుర్చీలలో ఆసీనులవుతున్న ఆహ్వానితులు!

—కలెక్టర్‌గారూ భార్య వచ్చినప్పుడు సినిమా యాక్టర్లు వచ్చినప్పుడూ పెద్ద పెద్ద సంస్థల యజమానులూ నిర్వాహకులూ వచ్చినప్పుడూ— మధ్య మధ్య వారి ఆగమనాన్ని ఎత్తి చూపే నిశ్శబ్దాలూ — గుసగుసలూ!

—వేదికపై బ్రాహ్మణ పుంగవుల మంత్రోచ్చారణలు.

ఉన్నట్టుండి ఒక్క మాటుగా— మంగళవాయిద్యాలు మార్మ్రోగుతుండగా— మాంగల్యధారణ జరిగిపోయింది. ఆహ్వానితుల అక్షతల వర్షంలో సౌందర్య మోహన్ ల వివాహం అతి వైభవంగా జరిగిపోయింది.

అంతవరకూ రాఘవరావుగారు రాసిన సందేశం ఆయన దగ్గరే వుండిపోయింది!

పెద్దలందరకూ విడివిడి నమస్కరిస్తూ నూతన దంపతులు వివాహవేదిక నుంచి భవనంలోకి వచ్చారు.

శోభనం కార్యక్రమానికి మరికొంత టైముంది. బంధుమిత్రుల పంక్తి భోజనాలకు ఏర్పాట్లు హడావుడిగా జరుగుతున్నాయి.

రాఘవరావుగారి బుర్రలో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది.

మేడమీద తన గదిలోకి వెళ్లారు. కిటికీ ప్రక్కన మేజామీద అందమైన ఒక వెండి పళ్లెంలో తను రాసిన ఉత్తరం ఉంచారు. అల్లుణ్ని ఒకసారి ఒంటరిగా అక్కడకు రమ్మని వర్తమానం పంపారు.

గదిలోకి వస్తున్న మోహన్‌ని ఎదురుగా వెళ్లి రిసీవ్ చేసుకుని ఆ కిటికీ వరకూ నడిపించారు. "బాబూ! ఇందులో నీకొక చిన్న సందేశం రాసి ఉంచాను. ఒక్క పది నిముషాలు ఈ ఉత్తరంతో గడపమని నా మనవి. ఈలోపున క్రింద చూడవలసిన ఏర్పాట్లు చూస్తూంటాను" అంటూ అతన్ని మేజా దగ్గర కుర్చీ లో కూర్చోబెట్టారు. మేడ దిగి ఒకసారి వెనక్కు తిరిగి చూసి, చాలా అందగాడు కాని మనసెలాంటిదో ఎలాటి సంస్కారమో" అంటూ మనసులోనే గొణుక్కున్నారు.

* * *

శోభనం గది దగ్గర అల్లరి పళ్ళెం వేడుకల కోలాహలం! అంతవరకూ బాగా అలసిపోయిన రాఘవరావుగారు ఆ గదికి దగ్గర్లోనే హాల్లో మడత కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

కొంత సేపటికి గది ముందర జేరిన వారంతా తప్పుకుని ఎలాగైతేనేం వాళ్లని తలుపులు వేసుకోనిచ్చారు. అల్లుడు ఎలాంటివాడో సౌందర్యను ఎలా చూసుకుంటాడో మొదటిరాత్రి అది ఎలా ప్రవర్తించాలో అన్నది ఎవరైనా చెప్పారో లేదో!?

..పిచ్చిపిల్ల! దగ్గరుండి తల్లి అన్నీ చూసుకొనవలసిన విషయం ఆ అదృష్టం దానికి లేకపోయింది.

...అతని ప్రవర్తన ఎలా వుంటుందో ఏమిటో!?

ప్రొద్దునే దాని ముఖం ఎలా వుంటుందో!?

..భారంగా కుర్చీలో జార్లపడి అలా ఆలోచిస్తూనే వున్నారు రాఘవరావుగారు.....




ఉన్నట్టుండి బిగ్గరగా ఆ గదిలో నుండి అతని గొంతు వినిపించింది రాఘవరావుగారికి

"ఇంక నీ కంటే ఈ భూప్రపంచంలోనే సుందరాంగులూ పతివ్రతలూ లేనట్టు మాట్లాడతాడేమిటి మీ నాన్న? ఆయన రాసిన దాంట్లో అణువణువునా నీ గురించి గర్వం! సిగ్గు లేకుండా ఈ సొంత డబ్బా ఏమిటి!"

........

"నీ జీవితంలో ఏమైపోతుందోనని బాధ పడిపోతున్నాట్ట!? నీకు నేను తగులుకున్నానని నువ్వు బాధపడుతూంటే మరి నాకు నువ్వు తగులు కున్నావని నేనెంత బాధపడిపోవాలి!?

.....

"శోభనపు గదిలో పనుగడ్డలూ స్కాచ్ విస్కీ పెట్టించాలని తెలియని వాళ్లు వీళ్ళేమి పెళ్లి చేశార్రా బాబూ!? నేను తెచ్చుకున్నానుగనుక సరిపోయింది! నయమే రాత్రంతా వేస్టయిపోను!!"

......

"అమ్మమ్మ!! ఎమ్మెస్సీ చదువుకున్న దానివి ఈ తతంగాలన్నీ కొత్తంటే నేన్నమ్మను!!" ఇంకా నువ్వేదో వెరైటీ చూపిస్తావనుకున్నాను! మరి ఇంతేనా? నా పెళ్ళంతా వేస్టయిపోయినట్టేనా!?

.........

నాకు తెల్సు! మంత్రాలూ చింతకాయలూ అంటూ ఇవాళ మంచి తిండి పెట్టరని! ఆ టేబుల్ మీద పెట్టించాను. చికెన్ బిర్యాని కొంచెం ఇలా పట్టా!!

........

"అమ్మమ్మా! ఎంత బరువైన మాటన్నావ్. ఇవాళ కూడా— ఇవాళ కూడా తినాలా అంటున్నావా! ఈ మాత్రం ఓపిక పుంజుకోపోతే జీవితాంతం నన్ను లోకువ గట్టేయవూ!?"

......

"గుచ్చుకునే ఈ పువ్వులూ ఈ కుచ్చుల జడలూ అంటే నాకు పరమ చిరాకు! సరదాగా జుట్టులో చెయ్యిపోనివ్వడానికే వీలుండదు. జడవిప్పుకుంటేనే బావుంటుంది. అవన్నీ విప్పెయ్.!!.....ఆ చెత్త వైలిన్ సంగీతం ఎందుకుగాని ఈ డిస్కో కేసెట్ పెట్టు.. కాస్త మజావొస్తుంది.

"అదుగో అదేమరి— మరింత చదువుకున్న దానివి ఏదైనా వుంటే వాదించాలిగాని ఏడుపేంటి! ఏడుపు! ఏడుస్తూనే వున్నావంటే నేను మనిషిని గాను!! ఆ నుత్తి ఇంక ఆపు!"

........

"బలిమాలితే ఎలా పూరుకుంటావులే! చెప్పవలసిన విధంగానే చెప్పాలి!"

—చెంప ఛెళ్లుమన్న శబ్దం!!

..."అమ్మా! తల్లీ! సౌందర్యా!...బాబూ అంతలా చేయి చేసుకోకు నాయనా!" అంటూ రాఘవరావుగారు కంగారుగా లేవబోయి మడత కుర్చీలోంచి క్రిందపడ్డారు!!

ఒకసారి తల విదిలించుకుని చుట్టూ చూశారు. హాల్లోనూ బయట పందిట్లోనూ అంతా నిశ్శబ్దంగానే వుంది. అందరూ ఇంకా నిద్రపోతున్నట్టున్నారు.

హబ్బా! అదంతా నిజమనుకున్నాను. అని తిరిగి మడత కుర్చీలో కూర్చుంటూ చేతివాచి చూసుకున్నారు. టైముఅయిదుగంటలవుతోంది.

గది తలుపులు తెరచిన శబ్దం! అటువైపు చూశారు రాఘవరావుగారు! సౌందర్య ముద్దమందారంలా సిగ్గులొలికించుకుంటూ తనవైపు వస్తోంది.

"నాన్నగారు! ఏమిటీ! పలకమారిందా! గదిలోకి మీ అరుపు గట్టిగా వినిపించింది. చెయ్యి చేసుకోకు బాబు అంటున్నారెవర్నీ!" అంటూ మెల్లగా ఆయన ప్రక్కన్న కూర్చుంది.

ఇది సీరియల్ కాదు,
యదార్థం ఎందుకు
కాకూడదు?
దేవుడా!
ఇలా తెల్లారనీకు
ఎప్పుడయినా
అలా తెల్లారితే
అడుగడుగునా
నరకయాతన
అడుగడుగునా
సస్పెన్స్
ఇలా అయితే
ఇంకేమైనా వుందా?

# దేవుడే రక్షించాలి

—ద్విభాష్యం రాజేశ్వరరావు



### మైనరు

"ఒరేయ్ వెంకూ! నీకు కూతురు పుడితే 'మైనరు' అనే పేరు మాత్రం పెట్టకు" అన్నాడు యేలేశ్వరరావు.

"ఏం ఎందుకని!" అడిగాడు వెంకు.

"రోజూ పేపర్‌లో చూడడంలేదూ? మైనరు బాలిక మానభంగం అని. అదేంటో కానీ ఈ 'మైనరు' పేరున్న అమ్మాయిలే ఎక్కువగా మానభంగం చేయుబడుతున్నారు" దీనంగా చెప్పాడు యేలేశ్వరరావు.

—జాకీర్ హుస్సేన్ (డోర్నకల్)

"ఏం లేదు తల్లీ పీడకల! అంతే" అంటూ తను విన్న మాటలు నెమరు వేసుకుంటూ చెప్పారు.

ఆయన మోకాళ్ల మీద తలవుంచుతూ "భలేవారే! మీ సెలక్షన్ అలా తప్పవుతుందా నాన్నగారు!? ఇంత కష్టపడి ఈయన్నూ వెతికినందుకు జన్మజన్మలకూ మీకు ఋణపడి వుంటాను. ఆయనెంతో మంచివారు!!" తండ్రి పాదాలకు నమస్కరించింది సౌందర్య.

"నా కల కలగా మిగిలిపోయింది గనుక సరిపోయిందమ్మా అది నిజమైనా— నేను చేయగలిగిందేముంది!? మన సంఘంలో ఆడపిల్ల బ్రతుకే అంత!! అంటూ ఆప్యాయంగా ఆమె తలమీద చెయ్యివేశారు.

* * *

ఆ మధ్యాహ్నం లంచ్ పడక గదిలో విశ్రాంతి తీసుకుంటున్న రాఘవరావుగారి వద్దకు చిరునవ్వు లొలికించుకుంటూ మెల్లగా వచ్చింది సౌందర్య.

ఆయన్ను మౌనంగా తన తల్లి పటం వద్దకు నడిపించి చేతిలో వున్న టూ ఇన్ వన్ మీటనొక్కింది.

మామగారి సందేశాన్ని జవాబుగా మోహన్ చెప్పిన మాటలు వినిపించాయి.

"మామగారూ—

సౌందర్యకు ఎలాటి మొగుడొస్తాడో అన్న విషయంలో మీరనుభవించిన కలవరం నేనర్థం చేసుకోగలను!

అయితే ఒక్కమాట!! ఒక ఆడపిల్ల జీవితం వివాహానంతరం ఎలా వుంటుందోనని ఆ పిల్ల తల్లి తండ్రులు వ్యథ పడినట్లే ఆమె కలయికతో తన జీవితం ఎలా మళ్లుతుందో నన్న కలవరం ఆ పిల్లాడికి అతని తల్లిదండ్రులకు కూడా వుంటుందన్న విషయం మరువకండి!

ఇంక సౌందర్య విషయం. ఆమె భావా ప్రవంతికి ఆమె అలవరచుకున్న నిర్మల స్వభావానికి నేను ఎంతో సంతోషపడుతున్నాను. ఆమె సంస్కృతికీ వ్యక్తిత్వానికి ఈ విధంగా రూపకల్పన చేయుగల్గిన మీకు జోహార్లు. ప్రతీ తండ్రీ తన తనయ విషయంలో ఇంత శ్రద్ధ చూపించాలని ప్రపంచంలోని పెళ్లి కొడుకు లందరి తరపునా నేను కోరుకుంటున్నాను. మీకు నా నమస్సులు!" *

●●